63

# మార్టిన్ లూథర్ కింగ్

ఆ పిల్లల పేర్లు క్రిస్టీనా, మార్టిన్,

వాళ్ళిద్దరూ ఉదయాన్నే లేచి ఆటలకు పరుగెత్తేవాళ్ళు. వాళ్ళ వీధి లోని దుకాణంవున్న ఇంటిముందు నిల్చుని- "టాం! పీటర్! మేం వెళ్తున్నాం-" అని అరిచే వాళ్ళు. టాం, పీటర్ బయటికొచ్చేవాళ్ళు. నలుగురూ కలసి మైదానానికి వెళ్ళి తనివితీరా ఆటలాడి ఏ మధ్యాహ్నమో అలసి ఇళ్ళకు వచ్చేవారు.

క్రిస్టీనా, మార్టిన్‌లను బడిలో చేర్పించారు. టామ్‌నూ, పీటర్‌నూ కూడా చేర్పించారు గాని, వేరే బడిలో !

బడినుంచి వచ్చాక మొదటిరోజు మధ్యాహ్నం క్రిస్టీనా, మార్టిన్‌లు దుకాణం దగ్గర కెళ్ళి ఎలుగెత్తి అరిచారు. టామ్, పీటర్ బయటికొచ్చారు కాని కదలలేదు. "ఇక మీదట మీతోబాటు కలిసి ఆడుకోవద్దంది మా అమ్మ-" అన్నారు.

"ఎందుకు'' అని ఆశ్చర్యంతో అడిగారు క్రిస్టీనా మార్టిన్లు.

"మీరు "నల్ల"వారు గనుక!' అని జవాబు వచ్చింది!!

పాదాలక్రింది నేల హఠాత్తుగా మాయమయితే ఎట్లా వుంటుంది ?

ఆ ఏడాది చివర బడి ఉపాధ్యాయుడు పిల్లలను విహారయాత్రకు తీసుకెళ్ళాడు. ఆ నీగ్రో పిల్లలందరూ పిచ్చుకలవలె, జింకలవలె హాయిగా ఎగురుతూ గెంతుతూ రోజంతా గడిపారు. సాయంకాలం బస్సులో ఇంటి కొస్తున్నారు. పిల్లలంతా కులాసాగా పాడుతున్నారు. ఒక స్టాప్‌లో

కొందరు తెల్లవారు బస్సులోకి ఎక్కారు. కాని అన్ని సీట్లూ నిండివున్నాయి. నల్లవారు లేచి నిల్చుని తెల్లవారిని కూర్చోనివ్వాలని బస్సు డ్రైవర్ ఆజ్ఞాపించాడు. ఉపాధ్యాయుడు, ముగ్గురు విద్యార్థులు లేచి నిల్చున్నారు. కాని మార్టిన్‌కు అతడి మిత్రులకు చాల కోపం వచ్చింది వాళ్లు తమ సీట్లనుండి లేవలేదు మళ్ళీ డ్రైవర్ అరిచాడు "ఏయ్ నల్ల కుక్కల్లారా! లేవమంటే లేవరేం ?" ఉపాధ్యాయుడు మార్టిన్ భుజం తట్టి— "అది చట్టం; చట్టాన్ని మనం అనుసరించాలి.'' అన్నాడు.

పెరిగి పెద్దయినాక ఆ సంఘటన గురించి "మేము లేచి నిల్చున్నాం. అట్లాంటా దాక 90 మైళ్ళ దూరమూ నిలబడే వున్నాము. ఆ సాయంత్రం నా మనసులో చెలరేగిన అవమానం, ఉక్రోషం- నేనెన్నటికీ మరవలేను-" అని రాశాడు మార్టిన్ లూథర్ కింగ్.

పారిజాతం మీద ఇనుప పాదం ముద్ర ఎలా వుంటుంది.

మార్టిన్‌కు ఎనిమిదేళ్ళ వయసులో— ఒక సంఘటన జరిగింది. సుప్రసిద్ధ నీగ్రో గాయకురాలు యిన్‌బెస్సీస్మిత్ ఒక ప్రమాదానికి గురి— అయింది. వెంటనే అంబులెన్సులో ఆమె నా దగ్గర్లో వున్న ఆస్పత్రికి తీసుకువెళ్లారు— అది తెల్లవారి కోసం ప్రత్యేకించినదని ఆమెను లోపలికి రానివ్వలేదు. ఆ మిసిసిపీ ప్రాంతంలో వున్న ఆస్పత్రిలన్నీ అలాటివే అయినందున ఆ గాయపడిన వ్యక్తికి వైద్య సహాయం—అందలేదు. సకాలంలో రక్తం ఎక్కించనందున బెస్సీస్మిత్ స్ట్రెచర్ మీదే మరణించింది!

ఆమెకు కావలసివచ్చి దొరకక పోయిన రక్తం రంగేమిటి? తెలుసా ?

♦ ♦ ♦

'ఇంద్రనీలము నల్పు, ఇంద్రాచలము నల్పు, యమునా నదియు నల్పు, యముడు నల్పు, సామజంబు నల్పు, రామచంద్రుడు నల్పు,

వల్లభుడు నల్పు, రాత్రి నల్పు, ఆవేశమది నల్పు, హరుని కంఠము నల్పు-

అని తెలుగు పద్య కారుడు నలుపు నాణ్యతను ఎంత వర్ణించినా అమెరికాలోని నీగ్రోల తది తరతరాల శాపమై, రౌరవ నరకమై తాండవం చేస్తున్నది.

అబ్రహాం లింకన్ పుట్టిన ఆ నేలలో, రాల్ఫ్ వాల్డో ఎమర్సన్ పలికిన ఆ భూమిలో, అల్లంత ఎత్తున చేతితో వెలుగు దివ్వెలో, అందరి సమానతనూ ఆశీర్వదిస్తున్న అభయ హస్తపు 'స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ' నిలబడిన దేశంలో, ఇరవై యవ శతాబ్దపు పట్టపగలే ఈ అమవసి నిసి!

"Man's inhumanity to man makes countless thousand mourn—" అన్న కవి రాబర్ట్ బర్న్స్ మాట ఎన్నటికి అబద్ధం అయ్యేను ?

బాధల క్రూరమృగాలు విశృంఖలంగా విహరించే అటవీ నాగరికత మధ్య పావురాలూ, పశువులూ, లేళ్ళూ, లేగ దూడలూ బ్రతకగలగడం కోసం, తమ జీవితాలను ధారపోసిన ఎందరో మహానుభావులలోని ముందరి వరసలో వాడు మార్టిన్ లూథర్ కింగ్!

1929 జనవరి 15 న పుట్టిన కింగ్ 1968 ఏప్రిలు 4 న ఒక హంతకుడి తుపాకి గుండుకు ఎర అయ్యేలోగా అమెరికాలోని నీగ్రోలను నిద్రలేపి, మట్టికి ప్రాణం పోసి, బొగ్గును నిప్పుగా రగిల్చిన విప్లవ మూర్తి.

నీగ్రోలకు ఓటింగ్ హక్కు కూడా ఇవ్వరాదన్న దినపత్రికకు వ్యతిరేకంగా ఉద్యమం నడిపిన వాడు. బళ్ళల్లో తెల్లవారయినా, నల్లవారయినా ఉపాధ్యాయులందరికీ జీతాలు సమానంగా వుండాలని పోరాడిన వాడు తండ్రి. ఆ గట్టి చెట్టున పుట్టిన పట్టుగొమ్మ 'మైకేల్' లూథర్ కింగ్. అతగాడి ఆరవ యేట తండ్రి అతడి పేరును ప్రొటెస్టెంటు మత విప్లవకారుడికి గుర్తుగా

'మార్టిన్ లూథర్' కింగ్‌గా మార్చివేశాడు! థోరో రాసిన "సివిల్ డిస్ ఒబీడియన్స్" వ్యాసాన్ని 1944 లో చదవగానే తన దారి తెలిసినట్లయింది కింగ్‌కు.

—తనలో రగులుతున్న ఆకాంక్షలకు స్వరూపం యివ్వడానికి మతాచార్య పదవియే మంచిదారి అని నమ్మిన మార్టిన్ లూథర్ కింగ్ 1955 లో చదువు ముగించి మాంట్ గోమరీ చర్చిలో ఆచార్య పదవి నలంకరించాడు. అదే సంవత్సరంలో చక్కని పాట కత్తె అయిన కొరెట్టాని చేపట్టాడు. అదే సంవత్సరం డిసెంబర్ మొదటి తేదీన బస్సులో నించోవడానికి ఏ మాత్రమూ ఓపికలేని ఒక నీగ్రో వనిత తెల్లవారికోసం లేచి నిల్చోడానికి నిరాకరించింది. ఆమెను అరెస్టుచేసి, పది డాలర్లు జరిమానా విధించడంతో నీగ్రోలు అగ్గి దగ్గ మహాదగ్రులయ్యారు.

అప్పుడు వారి ఎదుట నిలిచాడు మార్టిన్ లూథర్ కింగ్. 'హింస కాదు, అహింస మన ఆయుధం' అన్నాడు. వారికి ముందుగా నిలబడి, వారిని ముందుకు నడిపించసాగాడు.

ఆతడి నాయకత్వంక్రింద నీగ్రోలు బస్సులు ఎక్కడం మానివేశారు. వర్షాకాలం మొదలయింది. అయినా నీగ్రోలు నడుస్తూనే వున్నారు. ప్రయాణీకులు లేనందున బస్సుల కంపెనీకి 40 మిలియన్ డాలర్లు (సుమారు 32 కోట్ల రూపాయలు) నష్టం వచ్చింది. తెల్లవారి ఆధిపత్యం క్రింద వున్న కౌన్సిలు కఠిన చర్యలు తీసుకుంది. కింగ్‌ని అరెస్టు చేశారు. తిట్టారు. అవమానించారు. కాని "ఆ చీకటి క్షణంలో తలను మేజామీదపెట్టి మనసారా ప్రార్థించాను. దైవసన్నిధిలో వున్నట్టి అపూర్వమైన అనుభూతి నాకు కల్గింది. 'సత్యంకోసల న్యాయంకోసం పోరాడు! దేవుడు నీ ప్రక్కనే వుంటాడు' అని నాలోపల ఎవరో పలికినట్లయింది. నాలోని సందేహం, భయం ఎగిరిపోయాయి. బయట పరిస్థితులన్నీ అలాగేవున్నాయి. కాని నాలోపల దేవుడుదయించాడు–" అంటాడు కింగ్.

అతడి ఇంటిమీదకు బాంబులు విసిరారు. మళ్ళీ ఇంకోసారి అరెస్టు చేశారు. స్థానిక కోర్టులో తెల్ల జడ్జిద్వారా నల్లవారికి వ్యతిరేకంగా తీర్పు నిప్పించారు. కాని కింగ్ సుప్రీంకోర్టుకు వెళ్ళాడు. 1956 నవంబర్ 13న- "బస్సులలో వర్ణవివక్షత రాజ్యాంగ చట్ట విరుద్ధం!-" అని సుప్రీంకోర్టు తీర్పు నివ్వడంతో, తరతరాలుగా గులాములుగా తలవంచిన నీగ్రోజాతి నిటారుగా తల ఎత్తి నిలబడింది. అదేరోజున మార్టిన్ లూథర్ కింగ్, ఇతర నీగ్రోలు కలసి తెల్లవారితో సమానంగా బస్సులెక్కి ప్రయాణించారు.

నీగ్రోలను విద్యావంతులు చేసి, వారిని అభిమానంగల చైతన్య దీపాలుగా వెల్గించే నిమిత్తం కింగ్ ఒక సంస్థను స్థాపించాడు. క్రమంగా వేలాది కార్యకర్తలను తయారుచేసి దేశం నలుమూలలకు పంపసాగాడు. 340 సంవత్సరాలపాటు సర్వావమానాలూ సహించిన నీగ్రోలందరూ సమాన హక్కులకై శాంతియుతంగా పోరాడేలా చేశాడు.

"క్రైస్తవ మతాశయాలు నాకు సంయమనం నేర్పితే— గాంధీజీ నా కార్య నిర్వహణకు దారి చూపాడు!" అన్న మార్టిన్ ఒకసారి గాంధీజీ గురించి ఉపన్యాసము విని ముగ్ధుడై గాంధీ మీద, అహింసాయుత విప్లవం మీద ఉన్న పుస్తకాలన్నీ చదివి జీర్ణించుకున్నాడు. 1959లో కింగ్ భారత దేశానికి వచ్చినప్పుడు— "అపకారికి ఉపకారం చేద్దాం. చెడుకు మంచితో స్వాగతం చెబుదాం. శత్రువులను ప్రేమిద్దాం. క్రైస్తు దారిచూపించాడు; గాంధీ ఆ దారి గమ్యానికి చేర్చగలరని ఋజువుచేశాడు" అన్నాడు.

అందుకనే న్యూయార్క్ టైమ్స్ పత్రిక 1961 కింగ్‌ను గురించి రాస్తూ— "అతడిలో అహంకారంగాని, కృత్రిమమైన మేధో విన్యాసంగాని కన్పించవు. తన్ను యాతనపెట్టిన తెల్లవారిమీద అతడిలో ద్వేషభావం లేదు" అని పేర్కొంది.

1863 జనవరి ఒకటవ తారీకున అబ్రహాం లింకన్– "నేటి నుండి బానిస లందరికీ సంపూర్ణ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ప్రకటిస్తున్నాను—''

అన్నాడు. 1963లో ఆ ప్రకటన శతజయంతి సందర్భంగా నల్లవారికి అన్ని చోట్ల, అన్నిరంగాలలో సమానత్వం సంపాదించే ఉద్యమం మొదలుపెట్ట దలిచాడు. క్లబ్‌లలో, హోటళ్ళలో, ఆఫీసుల్లో, ఆస్పత్రులలో, దుకాణాలలో నల్లవారు ప్రవేశించి తెల్లవారితో సమానంగా కూర్చునే ఉద్యమం మొదలు పెట్టారు.

దాంతో మళ్ళీ తెల్లవారి ఆగడం మొదలయింది. అరెస్టులు, అల్లర్లు మొదలయ్యాయి. 3000 మంది నీగ్రోలతోబాటు కింగ్‌నుని అరెస్టు చేశారు. అతడిని ఎక్కడికి తీసుకువెళ్ళారో తెలియక మూడురోజులు తల్లడిల్లిన అతడిభార్య కొరెట్టా అమెరికా అధ్యక్షుడయిన కెనెడీకి ఫోన్‌చేసింది. ఆయన అప్పుడులేడు ఆ మరుసటి ఉదయం కెనెడీ ఆమెకు స్వయంగా ఫోన్‌చేసి, క్షమాపణలు చెప్పి కింగ్ అతి త్వరలో ఆమెను కలుసుకుంటాడని చెప్పాడు. నాలుగు రోజుల తర్వాత కింగ్ విడుదల అయ్యాడు—వెంటనే ఉద్యమమూ మొదలయింది.

1964 నోబెల్ శాంతి బహుమతిని 35 సంవత్సరాల మార్టిన్ లూథర్ కింగ్ కిచ్చారు. అతడు— 'సమాన హక్కు పోరాటానికి కానుకగా' ప్రపంచం ఇచ్చిన గుర్తింపుగా దానిని స్వీకరించి ఆ డబ్బు మొత్తాన్ని నీగ్రోల సంక్షేమ నిధికిచ్చివేశాడు.

నోబెల్ పురస్కారం అందుకుంటూ—"ఒకనాడీ ప్రపంచంలో యుద్ధం బదులు శాంతి, రక్తం బదులు ప్రేమ నిలుస్తాయని నమ్మడానికి సాహసిస్తున్నాను. సింహము, గొర్రెపిల్లా కలిసి ఎట్టి భయమూ లేకుండా జీవిస్తాయని ఆశిస్తున్నాను. ఆ రోజుకూ మనకూ మధ్య ఎన్నో అవరోధాలున్నప్పటికీ, వాటన్నింటినీ దాటి తీరుతాము—" అని ఎలుగెత్తిచాటిన మార్టిన్ లూథర్ కింగ్ గళం రాబోయే యుగాలకు భూపాల రాగం.

ఇంకా ఉద్యమం నడుపుతుండగానే '68లో ఏప్రిలు 4న ఒక

హంతకుడు పేల్చిన తుపాకి గుండు కింగ్ శరీరాన్ని చంపింది. కాని **అతడి** ఆత్మ శక్తి దివ్యంగా వెలుగుతూనే వుంది.

ప్రహ్లాదుడిని హిరణ్యకశిపుడు హింసించాడు. సీతమ్మతల్లిని **రావణుడు** చెరపట్టాడు.

అబ్రహం లింకన్‌ను, గాంధీని, కెనడీని ఆధునిక యుగపు **రాక్ష**సులు కాల్చి చంపారు.

మనిషిని చంపగలరుగాని మనిషిలోని రేపటి యుగాల **వెలుగును** చంపలేరు. అది చిరంజీవి.

అందుకనే కోటి కోటి చీకట్లను దాటుకుని మానవజాతి వెలుగుల ధనుష్కోటివైపే నడుస్తుంటుంది. "బాగా చీకటిగా వున్నప్పుడే నక్షత్రాలు కన్పడతాయి–" "ఏది సత్యం, ఏదసత్యం—" అన్న చీకటి ఆవరించి నప్పుడెల్లా దారి చూపే ధ్రువతారలు గాంధీలు, మార్టిన్ లూథర్ కింగ్‌లు!

★